






ఆర్థిక పద్దులపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

శాంతి భద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం

కొత్త పోలీసుస్టేషన్లు, ఫైర్‌స్టేషన్లు నిర్మిస్తాం ● అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకే తమ ప్రథమ ప్రాధాన్యమని, అందుకోసం మరిన్ని పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేస్తామని, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అదే విధంగా అగ్ని ప్రమాదాల్లో ప్రాణాపాయం జరుగకుండా మరిన్ని అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఈ విషయాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఫైర్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నదని వివరించారు. శాసనసభలో బుధవారం ఉదయం పోలీసుశాఖకు చెందిన ఆర్థిక పద్దులపై ఆయన ప్రసంగించారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... పుదుకోట జిల్లా అరంతాంగి ఆవుడయార్ కోయిల్ వద్ద ఫైర్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం స్థలసేకరణ పూర్తిచేసిందని, వచ్చే యేడాది ఫిబ్రవరిలోగా ఆ ప్రాంతంలో అగ్ని మాపక కేంద్రాన్ని నిర్మిస్తామన్నారు. మధురవాయల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అయ్యంబాక్కంలో సుమారు 1.15లక్షల మంది నివసిస్తున్నారని, అక్కడ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని శాసన సభ్యుడు గణపతి అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ అయ్యపాక్కం చుట్టూ 25 కి.మీ.ల దూరంలో అంబత్తూరు , ఆవడి వద్ద, రెడ్‌హిల్స్ వద్ద, పూందమల్లి వద్ద ఫైర్‌స్టేషన్లున్నాయని, కనుక అయ్యపాక్కం వద్ద నిబంధనల ప్రకారం ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు అవకాశం లేదని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ పలు జిల్లాల్లో కొత్తగా 72 పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశామని, 23 అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి 22 ఫైర్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించామని, మరో ఫైర్‌స్టేషన్ నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. నిధుల సమకూరిన తర్వాత సభ్యులు తెలిపిన ప్రాంతాల్లో ఫైర్‌స్టేషన్లు, పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్టాలిన్ పేర్కొన్నారు.

మూడు మార్గాల్లో ఆర్‌ఆర్‌టీఎస్ సేవలు

● సాధ్యాసాధ్యాలపై నివేదిక తయారీకి టెండర్ల ఆహ్వానం



పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా, గంటకు 160 కి.మీ హైస్పీడ్‌తో పరుగులు తీసే రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ (ఆర్‌ఆర్‌టీఎస్) మార్గాల అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై నివేదిక సిద్ధం చేసేందుకు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ఈ నెల 14న ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. విస్తృతమైన పట్టణీకరణ పరిగణలోకి తీసుకొని అతి వేగంతో కూడిన రైలు రవాణా అభివృద్ధి చేసేలా సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, చెన్నై-దిండివనం-విల్లుపురం, చెన్నై-కాంచీపురం-వేలూరు, కోయంబత్తూర్-తిరుప్పూర్-ఈరోడ్-సేలం తదితర మూడు మార్గాల్లో సీఎంఆర్‌ఎల్ సర్వే చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఆర్‌ఆర్‌టీఎస్ రైలు రవాణా సేవల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నివేదిక అందించే సంస్థ ఎంపికకు సీఎంఆర్‌ఎల్ టెండర్లు ఆహ్వానించింది. చెన్నై-చెంగల్పట్టు మీదుగా దిండివనం వరకు 160 కి.మీ వేగంతో ఆర్‌ఆర్‌టీఎస్ రైలు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే, చెన్నై-కాంచీపురం మార్గంగా వేలూరుకు 160 కి.మీ వేగంతో, కోవై నుంచి తిరుప్పూర్, ఈరోడ్ మీదుగా సేలంకు హైస్పీడ్ రైళ్లు నడపనున్నారు. కాగా, గంటకు అధికంగా 160 కి.మీ వేగంతో వెళ్లేలా ఆర్‌ఆర్‌టీఎస్ రవాణా ఢిల్లీ-మీరట్ మధ్య అందుబాటులో ఉంది.

ఇక విజయ్ ఒంటరేనా?



● అమిత్‌షా-ఈపీఎస్ భేటీతో డైలమాలో 'టీవీకే'

● బీజేపీ-అన్నాడీఎంకే పొత్తుతో పునరాలోచనలో విజయ్ పార్టీ!

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్‌కి ఒంటరి పోరు తప్పదా?.. ఆయనతో కలిసొచ్చే పార్టీలు కరువయ్యాయా?.. అవుననే అంటున్నాయి జరుగుతున్న పరిణామాలు. లేనిపక్షంలో ఆయన మనసు మార్చుకుని ఇన్నాళ్లూ తను ప్రశ్నించిన పార్టీలతోనే జత కట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇన్నాళ్లూ బీజేపీకి దూరంగా వున్న అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్).. బీజేపీ అగ్రనేత అమిత్‌షాతో మంగళవారం రాత్రి ఢిల్లీలో భేటీ అయిన విషయం తెలిసిందే. కూటమి గురించి మాట్లాడలేదంటూ ఆయన చెబుతున్నప్పటికీ, అది తప్ప మరొక అవసరమేమీ ఆ నేతల భేటీకి కారణం ఏదీ కనిపించడం లేదు. అయితే బీజేపీతో తమ పొత్తు ఖరారైనట్లేనని అన్నాడీఎంకే వర్గాలు సైతం పరోక్షంగా అంగీకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ దారెటు అన్నదానిపై ఆయన అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

అప్పుడు దూరమై... ఇప్పుడు దగ్గరై..!

2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో జత కట్టి పోటీ చేసిన అన్నాడీఎంకే.. మైనారిటీల ఓట్లు తమకు దూరమయ్యాయన్న కారణంగా తమ మిత్రుణ్ని దూరం పెట్టింది. అయితే బీజేపీతో చెలిమి లేకుండా పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసినా ఆ పార్టీకి పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. అనంతరం అన్నాడీఎంకే నేతలపై వరుసగా జరుగుతున్న ఈడీ దాడులు.. పార్టీలో అంతర్గత కలహాల కారణంగా సతమతమైపోయిన ఈపీఎస్.. ఎట్టకేలకు బీజేపీ దారి పట్టారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన కాషాయ పార్టీతో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-అన్నాడీఎంకే కలిసి పోటీ చేయడం ఖాయమైపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పాటు కలిసి సాగిన బీజేపీ, పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్ ఆ తరువాత విడిపోయ్యాయి. ఇప్పుడు మళ్లీ ఇదే కూటమి ఒకే గాటున రావడం ఖాయమైంది. ఈ కూటమిలోకి అదనంగా డీఎండీకే, నామ్ తమిళర్ కట్చి చేరడం దాదాపు ఖాయమైంది.

పటిష్ఠంగా డీఎంకే మిత్రుల బంధం

డీఎంకే కూటమిలోని మిత్రపక్షాల బంధం పటిష్ఠంగానే కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఆ కూటమిలో డీఎంకేతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే తదతర పార్టీలున్నాయి. ఇందులో ఒక్క డీపీఐ తప్ప మిగిలిన పార్టీలన్నీ ఇప్పటికే డీఎంకే పట్ల అచంచల విశ్వాసం కనబరుస్తున్నాయి. దీంతో ఈ సారి ఎన్నికల్లో ఇదే కూటమి కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ కూటమిలోకి అదనంగా సీనియర్ నటుడు కమల్ హాసన్ నేతృత్వంలోని మణిదనేయ మక్కల్ కట్చి చేరింది.

2021 ఎన్నికల్లో డీఎంకే కూటమికి 45.38 శాతం ఓట్లు, అన్నాడీఎంకే కూటమికి 39.72 శాతం ఓట్లు పోలయ్యాయి. 5.66 శాతం ఓట్ల వ్యత్యాసంతో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ సారి అన్నాడీఎంకేతో టీవీకే చేరితే ఈ శాతం మారిపోవడం తథ్యమన్ని అన్ని వర్గాలు భావించాయి. విజయ్ పార్టీ నేతలు ఏం చెప్పినా, ఆ పార్టీకి 8 శాతం ఓట్లు పోలవడం ఖాయమని పలు సర్వేలు చెబుతున్నాయి. దీంతో అన్నాడీఎంకేతో టీవీకే జత కడితే ఈ కూటమి విజయం తథ్యమని అన్ని వర్గాలు భావించాయి. ఆ మేరకు ఈ రెండు పార్టీల మధ్య చర్చలు జరిగాయి. కానీ టీవీకే నుంచి వస్తున్న డిమాండ్లను భరించలేకపోతున్నామన్న అన్నాడీఎంకే నేతలు ఆ పార్టీకి దూరం జరిగారు.

ఇప్పుడు విజయ్ దారెటు?

ఇప్పుడు ఏకంగా బీజేపీతో జత కట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దీంతో విజయ్ పార్టీ ఏకాకిగా మిగిలిపోయినట్లు కనిపిస్తోంది. తొలి మహానాడు నుంచే విజయ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా, రాష్ట్రంలో డీఎంకే పైనా నిప్పులు చెరుగుతున్నారు. దీంతో విజయ్ డీఎంకే కూటమితో జత కట్టలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఆయన అటువైపు మొగ్గు చూపినా అక్కడ ఆయన పార్టీకి తగినన్ని స్థానాలు లభించే అవకాశం కనిపించడం లేదు. ఇక బీజేపీతో జత కట్టేందుకు సిద్ధమైన అన్నాడీఎంకే కూటమిలో చేరడం గానీ లేదా ఒంటరిగా పోటీ చేయడం గానీ విజయ్ ముందున్న మార్గాలు. కానీ ఇప్పటి వరకూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసిన విజయ్.. ఇంతలో మనసు మార్చుకుంటారా, లేక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ చెప్పినట్లు ఒంటరి పోటీకి సిద్ధమవుతారా అన్నదానిపై ఆయన అభిమానులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్నందున ఈ లోగా శత్రువులు మిత్రులు కావచ్చు, మిత్రులు శత్రువులు కావచ్చన్నది రాజకీయవర్గాల విశ్లేషణ. నిజమే ఎప్పుడు ఏమైనా జరగవచ్చు. అప్పటి వరకూ ఓటరు మహాశయుడు వేచి వుండక తప్పదు.

పొత్తులపై చర్చించలేదు

రాష్ట్ర సమస్యలు పరిష్కరించాలని కోరాం ● అమిత్‌షాతో భేటీపై ఈపీఎస్

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో జరిగిన భేటీలో పొత్తులపై చర్చించనేలేదని, కేవలం రాష్ట్ర సమస్యలపైనే ప్రధానంగా చర్చించానని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఢిల్లీలో మంగళవారం రాత్రి అమిత్‌షాతో భేటీ అయిన ఈపీఎస్.. గంటకుపైగా చర్చించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి త్వరితగతిన నిధులు విడుదల చేయాలని అమిత్‌షాకు విజ్ఞప్తి చేశానని, అదేవిధంగా విద్యాశాఖకు సంబంధించి నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశానని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో దశాబ్దాలుగా ద్విభాషా విద్యావిధానమే అమలులో ఉందని, త్రిభాషా విద్యావిధానాన్ని అమలు కోసం ఒత్తిడి చేయకుండా ప్రస్తుతమున్న విద్యావిధానాన్నే కొనసాగించాలని కోరినట్లు చెప్పారు. టాస్మాక్‌లో రూ.1000 కోట్లకుపైగా అవినీతి జరిగిందనే దానిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కూడా ఆయన్ని విజ్ఞప్తి చేశానన్నారు. బీజేపీతో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకోదంటూ గతంలో చేసిన ప్రకటన ఉపసంహరించుకుంటున్నారా అని విలేఖరుల ప్రశ్నించగా.. పొత్తులపై ప్రకటన చేయడానికి ఇది అనువైన సమయం కాదని, వచ్చే యేడాది ఎన్నికలు జరగటానికి ముందే పొత్తులను ఖరారు చేసుకుంటామన్నారు. గతంలో రెండు ఎన్నికల సందర్భంగా బీజేపీతో పొత్తు పెట్టుకోలేదన్న విషయాన్ని మరువకూడదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే పొత్తులు ఖరారవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పొత్తులు అదే రీతిలో కొనసాగుతాయని చెప్పలేమని డీఎంకే కూటమిలో ఉన్న మిత్రపక్షాలు ఆ కూటమిలోనే కొనసాగుతాయనే గ్యారెంటీ లేదన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

డీఎంకేని ఓడించేందుకు ప్రయత్నిస్తాం...

అవినీతిలో కూరుకుపోయిన డీఎంకే ప్రభుత్వాన్ని ఓడించడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని ఈపీఎస్ తెలిపారు. ఢిల్లీ నుంచి నగరానికి తిరిగొచ్చిన ఆయన విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలు వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ కూటమిలోనే కొనసాగుతాయనే గ్యారెంటీ లేదన్నారు. రాష్ట్రంలో డీఎంకేని చిత్తుగా ఓడించడమే అన్నాడీఎంకే ఏకైక లక్ష్యమని, ఆ దిశగానే తాము పావులు కదుపుతామని ఈపీఎస్ స్పష్టం చేశారు..

ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా బీజేపీదే అధికారం: ఓపీఎస్

దేశంలో ఏ ఎన్నికలు జరిగినా, ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా ఇక కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జల్లికట్టు సమస్య ఏర్పడినప్పుడు ఒకే రోజు ఆ సమస్య పరిష్కరించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు.

తరమణి వద్ద ఎన్‌కౌంటర్

● చైన్ స్నాచింగ్ కేసులో అరెస్టయిన దోపిడీ దొంగ హతం



సహచరుడితోపాటు బైకుపై వెళుతున్న జాఫర్‌గులామ్ హుస్సేన్ (సీసీ కెమెరా దృశ్యం)



ఎన్‌కౌంటర్‌లో హతమైన జాఫర్ గులామ్ హుస్సేన్ (ఫైల్‌ఫొటో)

టీనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట నుండి వేళచ్చేరి వరకు రహదారుల్లో నడచివెళుతున్న ఏడుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులను అపహరించి విమానాల్లో పారిపోయేందుకు ప్రయత్నించి అరెస్టయిన ఇద్దరిలో ఒకరు బుధవారం వేకుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ముంబయికి చెందిన జాఫర్ గులామ్ హుస్సేన్ (28) అనే ఆ దోపిడీ దొంగ అపహరించిన నగల రికవరీ కోసం, వాటిని దాచిపెట్టిన తరమణి రైల్వేస్టేషన్ ప్రాంతానికి పోలీసులు వేకువజాము 2.30 గంటలకు తీసుకెళ్ళారు. ఆ సమయంలో ఊహించని విధంగా అక్కడ దాచిన నాటు తుపాకీతో జాఫర్ పోలీసులపై కాల్పులు జరిపి, పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమైన సీఐ మహమ్మద్ బుహారీ ఆత్మసంరక్షణార్థం కాల్పులు జరుపటంతో జాఫర్ అక్కడికక్కడే మరణించాడు. జాఫర్ ఉపయోగించిన మోటారు బైకు, రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్ గురించి తెలియగానే పోలీసు ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి వెళ్ళి విచారణ జరిపారు. ఆ తర్వాత జాఫర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జాఫర్‌పై నగరంలోని వివిధ పోలీసుస్టేషన్లలో 50కి పైగా దోపిడీ కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వరుస బంగారు గొలుసుల చోరీలకు సంబంధించి జాఫర్‌తోపాటు విమానాశ్రయంలో అరెస్టయిన మిజాం ఐదూష్ మేషమ్ ఇరానీగా గుర్తించారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో అరెస్టయిన సల్మాన్ హుస్సేన్ ఇరానీని రహస్య ప్రదేశంలో తీసుకెళ్ళి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పథకం ప్రకారమే చైన్ స్నాచింగ్..: సైదాపేట నుండి వేళచ్చేరి దాకా గంటలోపే ఏడుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులను ఉత్తరాదికి చెందిన యువకులు ఈ చోరీలకు పాల్పడ్డారని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తెలిపారు. తరమణి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో బంగారు గొలుసుల చోరీ నిందితుడు జాఫర్ గులామ్ హుస్సేన్ హతమైన ఘటన గురించి బుధవారం ఉదయం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇందులో ఇద్దరూ విమానాల్లో పారిపోయేందుకు ప్రయత్నించారని, విమానాశ్రయ భద్రతా విభాగం అధికారులు సకాలంలో సాయం చేయడంతో వారిని అరెస్టు చేయగలిగామన్నారు. వీరికి నగరంలో బైకు సమకూర్చడం, పరికరాలు అందించడంలో సాయపడిన సల్మాన్ హుస్సేన్ అనే మరో వ్యక్తి రైలులో పారిపోతుండగా ఒంగోలు రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నామన్నారు. గొలుసులను అపహరించిన ఇద్దరూ బైకుపై వెళ్తుండగా సీసీ పుటేజీలో హెల్మెట్లు ధరించి ఉండటంతో ముఖాలను సరిగా గుర్తించలేకపోయామన్నారు. అదే సమయంలో వారు వేసుకున్న బూట్ల రంగు ఆధారంగా, ఆ బూట్లు వేసుకున్న వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారా అని భద్రతాధికారుల వద్ద ఆరా తీశామన్నారు. ఆ వ్యక్తులు వచ్చారని చెప్పడంతో ఇద్దరినీ అరెస్టు చేయగలిగామన్నారు. వీరంతా ముంబయి కేంద్రంగా చేసుకుని విమానాల్లో వచ్చి బంగారు గొలుసులను అపహరించుకుని రెండు మూడు రోజుల తర్వాత విమానాల్లోనే పారిపోతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. విమానాశ్రయంలో అరెస్టయిన వారిపై ముంబయి నగర పరిధిలోని పలు పోలీసుస్టేషన్లలో 50కి పైగా దోపిడీ కేసులున్నట్లు తెలిపారు. ఇక మంగళవారం సైదాపేట నుండి వేళచ్చేరి వరకూ ఏడుగురి మహిళలు పోగొట్టుకున్న నగలన్నింటిని రికవరీ చేసినట్లు తెలిపారు.



అరెస్టయిన సల్మాన్, మిజాం ఐదూష్

అరుణ్ హయాంలో నాలుగో ఎన్‌కౌంటర్...

గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా అరుణ్ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటి దాకా నాలుగు ఎన్‌కౌంటర్లు జరిగాయి. బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన తిరువేంగడం, కాక్కాతోప్పు బాలాజీ, సీజింగ్ రాజా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమైన విషయం తెలిసిందే. తాజాగా నగరంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముంబయి యువకుడు జాఫర్ గులామ్ తరమణి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు.

సమాచార దృష్టి

దూరవిద్య సెమిస్టర్ ఫలితాల విడుదల

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో గత ఏడాది జూన్‌లో నిర్వహించిన యూజీ, పీజీ, సర్టిఫికెట్ కోర్సుల సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యార్థులు www.idunom.ac.in అనే వెబ్‌సైట్‌లో ఫలితాలు తెలుసుకోవచ్చని వర్సిటీ ప్రకటన విడుదల చేసింది.

నేడు పల్లావరంలో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం ఆఫీసర్స్ కాలనీలోని పల్లావరం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ శిబిరంలో పల్లావరం, షోలింగనల్లూర్, చుట్టుపక్కల ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని, విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

29న పనిచేయనున్న రేషన్ దుకాణాలు

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు ఈ నెల 29వ తేది పనిచేయనున్నాయి. ప్రతి నెలా చివరి రోజున నిర్వహణ పనులు కారణంగా రేషన్ దుకాణాల్లో సరుకులు ఇవ్వరు. ఈ నెల 30వ తేది ఉగాది, 31 రంజాన్ పండుగల సందర్భంగా ప్రభుత్వ సెలవులు వచ్చాయి. ఈ క్రమంలో, ప్రజలు సౌకర్యార్థం ఈ నెల 29వ తేది (శనివారం) రేషన్ దుకాణాలు పనిచేస్తాయని ఆహార శాఖ ప్రకటన విడుదల చేసింది.

2న వేతనాల జమ

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలు, మాజీ ఉద్యోగుల పింఛన్ ఏప్రిల్ 2వ తేది జమచేయనున్నారు. ఈ మేరకు సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మొత్తం 9.30 లక్షల మంది, పెన్షనర్లు, కుటుంబ పింఛన్‌దారులు కలిపి మొత్తం 7.05 లక్షల మంది బ్యాంక్ ఖాతాల్లో ప్రతి నెలా 1వ తేది జమచేస్తుంటారు. ఈ క్రమంలో, వార్షిక లెక్కల ముగింపు రోజు కావడంతో ఏప్రిల్ 1వ తేది బ్యాంకులకు సెలవు కావడంతో, 2వ తేది పింఛన్లు, వేతనాలు జమచేస్తామని ప్రభుత్వం తెలియజేసింది.

సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు

వేళచ్చేరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతిద): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని పన్ను వసూలు కేంద్రాలు సెలవు రోజుల్లో పనిచేయనున్నాయి. ఈ మేరకు జీసీసీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈనెల 29 శనివారం, 30ఆదివారం, 31 రంజాన్‌పండుగ సందర్భంగా మూడు రోజులు వరుస సెలవులు రానున్నాయి. కానీ, ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31 తో ముగియనున్న కారణంగా మూడు రోజుల్లోనూ వసూలు కేంద్రాలు పనిచేయనున్నారు. ఆస్తి, వ్యాపార పన్నులు, వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణకు తదితరాలకు వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ తెలియజేసింది.

రిజర్వేషన్ ప్రయాణికులకు ఎస్ఈటీసీ బంపర్ ఆఫర్

వేళచ్చేరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేయించుకొనే ప్రయాణికులకు రాష్ట్ర రోడ్డు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) బంపర్ ఆఫర్ ప్రకటించింది. ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెంచేలా ఎస్ఈటీసీ పలు చర్యలు చేపడుతోంది. కండిషన్ బస్సులు, అధునాతన సీటింగ్ వసతితో పాటు విశేష, సెలవు రోజుల్లో ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ప్రయాణికులు ఇబ్బంది లేకుండా ప్రయాణించేందుకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని సూచిస్తోంది. ఈ క్రమంలో, ఏప్రిల్ 1 నుంచి జూన్ 15వ తేది వరకు ఎస్ఈటీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల్లో 75 మందిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయనున్నారు. మొదటి బహుమతిగా 25 మంది ఎస్ఈటీసీ బస్సుల్లో ఏడాది (2025 జూలై 1 నుంచి 2026 జూన్ 30వ తేది వరకు) 20 సార్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. రెండవ బహుమతిగా మరో 25 మందికి ఏడాదిలో 10 సార్లు, మూడవ బహుమతిగా 25 మంది ఏడాది ఐదు సార్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్ఈటీసీ ప్రకటించింది.

రంజాన్, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్, వారాంతపు సెలవుల సందర్భంగా చెన్నై సహా పలు ప్రాంతాల నుంచి 2,415 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో కిలాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 28వ తేది 460 బస్సులు, 29న 530 బస్సులు నడుపనున్నారు. అలాగే, ఈ నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా చెన్నై సహా ఇతర ప్రాంతాల నుంచి 890 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈ నెల 28వ తేది 100 బస్సులు, 29న 95 బస్సులు, మాధవరం నుంచి 28,29 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. సెలవులు, పండుగలు ముగిసి తిరుగు ప్రయాణమయ్యే ప్రజలు సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు, ప్రజలు www.tnstc.in అనే వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకొని, రద్దీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించాలని ఎస్ఈటీసీ విజ్ఞప్తి చేసింది.

థాడ్కో ఆధ్వర్యంలో జెఈఈ ఎంట్రన్స్‌కు శిక్షణ

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): థాడ్కో-సీపీసీఎల్ సంయుక్తంగా విద్యార్థులకు జెఈఈ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో.. థాడ్కో, చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) సంయుక్తంగా ఆదిద్రావిడ, గిరిజనులు, ఇతర విభాగాలకు చెందిన విద్యార్థులకు జేఈఈపై శిక్షణ ఇవ్వనున్నాయి. ఈ శిక్షణకు ప్లస్ టూలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ కోర్సుల్లో ఆదిద్రావిడులు, గిరిజన వర్గాల చెందిన విద్యార్థులు 65 శాతం, ఇతర వర్గాలు 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, కుటుంబ సంవత్సరాదాయం రూ.4 లక్షలోపు ఉండాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.tahdco.com అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలి. అలాగే, సీపీసీఎల్ నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి, స్థానిక మనలిలోని సీపీసీఎల్ కళాశాలలో బస, ఆహారం, ఫీజు తదితరాలు సంస్థ భరించనుంది.

కూలిన భారతీయార్ స్మారక మందిరం పైకప్పు

రిసెప్షన్ రూంలో ధ్వంసమైన ఫర్నిచర్

టి.నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఎట్టయపురం 9వ వార్డు పెరుమాళ్‌కోవిల్ వీధిలో ఉన్న తమిళ మహాకవి భారతీయార్ స్మారక మందిరం పైకప్పు మంగళవారం సాయంత్రం కూలిపడటంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భారతీయార్ నివసించిన ఇంటిని రాష్ట్ర సమాచార శాఖ స్మారక మందిరంగా పునర్నిర్మించింది. అక్కడ పార్ట్‌టైమ్ లైబ్రరీకూడా నడుస్తోంది. మహాదేవి అనే మహిళ ఆ స్మారక మందిరం ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. రోజూ ఉదయం 9.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆ స్మారక మందిరాన్ని సందర్శకులకోసం తెరచి ఉంచుతారు. ఆ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు మహాదేవి ఆ స్మారక మందిరం తలుపులకు తాళం వేస్తుండగా ఉన్నట్టుండి ఆ స్మారక మందిరం పైకప్పు కూలిపడింది. పైకప్పు కూలి దిగువ అంతస్థు పైకప్పుపై పడటంతో అది కూడా ధ్వంసమైంది. దీంతో రిసెప్షన్ రూమ్‌లో ఉన్న బల్లలు, కుర్చీలు, ఫోటోలు ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం తెలియగానే ఎట్టయపురం తహసీల్దార్ శుభా ఇతర అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ దుర్ఘటనలో ఆ స్మారక మందిరం ఇన్‌ఛార్జి మహాదేవి తృటిలో ప్రాణగండటం నుండి తప్పించుకున్నారు.



స్మారక మందిరం పైకప్పు కూలిపడటంతో బీటలు వారిన గోడలు

మహిళలకు ఉచిత వృత్తి శిక్షణా తరగతులు

తిరుత్తణి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలోని అమ్మవారికుప్పం గ్రామంలోని మహిళలకు 'ది చిల్డ్రెన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణా తరగతులను ప్రారంభించారు. గ్రామంలోని పేద, మధ్యతరగతి మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ది చిల్డ్రెన్ ఫౌండేషన్ ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వారికి ప్లాస్టిక్ వైర్ బ్యాగ్స్ తయారీ ఉచిత శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించామని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. అనంతరం మహిళలకు ఉచిత కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపేట సబ్-జోనల్ రీజినల్ డెవెలెప్‌మెంట్ ఆఫీసర్ సూర్య, మహిళా సేవా సమితి అధ్యక్షురాలు నిర్మల, ఫౌండేషన్ ఆర్గనైజర్ రజిని, ట్రైనర్ సునీత సహా 20 మంది మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు కిట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

29న డీఎంకే ఆందోళన

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం బకాయిలు విడుదల చేయని కేంద్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా అధికార డీఎంకే ఆందోళన చేపట్టనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో... నాలుగేళ్లుగా ఉపాధి పథకంలో రాష్ట్రానికి రావాల్సిన రూ.4,034 కోట్లు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, ఈ నెల 29వ తేది అనుమతించిన రెండు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు దురైమురుగన్ ప్రకటించారు.

గృహాలు కేటాయించాలంటూ ఆందోళన

వాషర్‌మెన్‌పేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో నిర్మాణాలు ముగిసిన గృహాలు కేటాయించాలంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. తిరువొత్తియూర్ తిరుచ్చినాంకుప్పం బీచ్ రోడ్డులో తమిళనాడు నగరాభివృద్ధి సంస్థ 5 అంతస్తులతో కూడిన 360 గృహాలను నిర్మించాలని నిర్ణయించింది. ఈ పనులు 2023 నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించారు. గృహాల కోసం పలువురు డిపాజిట్ చెల్లించారు. గృహాల నిర్మాణాలు ముగిసినా ఇప్పటివరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. అలాగే, ప్రస్తుతం ఈ గృహ సముదాయం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో, నిర్మాణం ముగిసిన 360 గృహాలను సత్వరం కేటాయించాలని కోరుతూ బుధవారం ఉదయం ఎన్నూర్ బీచ్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న తిరువొత్తియూర్ పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో చర్చించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

ప్రచార రాజకీయాలను పక్కనబెట్టండి

పీఎంకే నేత డాక్టర్ రాందాస్

ప్యారీస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రచార రాజకీయాలను పక్కనబెట్టి రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టుకోవాలని రాష్ట్రప్రభుత్వానికి పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ సూచించారు. ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించేందుకు నిర్ణయం తీసుకున్న కెరియర్ గ్లోబల్ కార్పొరేషన్ (సీజీసీ), ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ సంస్థలు ఇక్కడ ఎట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణంలేదంటూ, ఆంధ్రరాష్ట్రంలోని శ్రీసిటీని ఎంపిక చేసుకున్నాయని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుచేశారు. 2021 అనంతరం డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడులు అధికస్థాయిలో వస్తున్నట్టు ఆర్భాటంగా ప్రచారం చేస్తోందని విమర్శించారు. పెట్టుబడులను రాబట్టుకునేందుకు వివిధ దేశాలకు వెళ్ళి ఏ స్థాయిలో పెట్టుబడులు సాధించారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాందాస్ డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే కరుప్పసామి పాండ్యన్ మృతి

టి.నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాకు చెందిన అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే కరుప్పసామి పాండ్యన్ బుధవారం ఉదయం మృతి చెందారు. కరుప్పసామి పాండ్యన్ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ హయాంలో 1977, 1980లో శాసనసభ్యుడిగా గెలిచారు. 2006లో డీఎంకేలో చేరి శాసనసభ్యుడిగా గెలిచారు. 2015 మే 14 డీఎంకే నుంచి సస్పెండ్ అయ్యారు. 2016 జూలై 26న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్‌ను కలిసి ఆ పార్టీలో చేరారు. తరువాత పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే కరుప్పసామి బుధవారం వేకువ జామునే నిద్రలోనే తుది శ్వాస విడిచారు.

7న ద్విచక్రవాహనాల వేలం

పెరంబూర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం పోలీసు కమిషనరేట్ పరిధిలోని పెరుంబాక్కం పోలీస్ స్టేషన్ సరిహద్దుల్లో చాలాకాలంగా ఆచూకీ లేకుండా పడి ఉన్న 48 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదుచేశారు.ఈ వాహనాలకు ఏప్రిల్ 7వ తేది బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఏప్రిల్ 4వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు గుర్తింపుకార్డు, జీఎస్‌టీ నెంబరు తదితరాలతో రూ.500 డిపాజిట్ చేసి పేర్లు నమోదుచేసుకోవాలి. పేర్లు నమోదుచేసుకున్న వారిని మాత్రమే వేలానికి అనుమతించనున్నారు. వేలంలో కొనుగోలు చేసిన వాహనాలను అదే రోజు సొమ్మును జీఎస్‌టీతో కలిపి చెల్లించాలని తాంబరం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

చెన్నై-తిరుపతి హైవేపై రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం



దగ్ధమైన బైక్

తిరుత్తణి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు, ఎదురుగా వేగంగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. వివరాలిలా... మేదినిపురానికి చెందిన అజిత్ (22)అనే యువకుడు బుధవారం ఉదయం నరసమంగళంలో వున్న తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా, అదే సమయంలో వన్‌వేలో మరో బైక్‌పై తిరుత్తణికి చెందిన రాజమణి (43)తన మిత్రుడితో కలిసి మద్యం మత్తులో వేగంగా రావడంతో ఆ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజిత్‌కు తీవ్రగాయాలు కాగా, అతడి బైక్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. మరోవైపు తాగిన మత్తులో వేగంగా బైక్ నడిపిన రాజమణి తలకు బలమైన గాయం కాగా, వెనుకవైపు కూర్చున్న తన మిత్రుడికి కూడా స్వల్పగాయాలయ్యాయి. గమనించిన అక్కడి స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలిసి ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు కేసునమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఐ కుటుంబానికి రూ.30 లక్షల ఆర్థికసాయం

● సీఎం ప్రకటన

వాషర్‌మెన్‌పేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతిచెందిన ఎస్ఐ కుటుంబానికి రూ.30 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. విల్లుపురం జిల్లా సామాజిక న్యాయం, మానవ హక్కుల విభాగం ఎస్ఐ పనిచేస్తున్న తమిళ్‌సెల్వన్ (57) ఈ నెల 13న ద్విచక్రవాహనంపై డ్యూటీకి వెళుతుండగా నాలుగు చక్రాల వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈ నెల 24న మృతిచెందాడు. ఈ విషయమై సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతిచెందిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఆయన మృతి కుటుంబానికి, సహచర ఉద్యోగులకు తీరని లోటని, ఆయన విడిచివెళ్లిన కుటుంబానికి రూ.30 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించినట్లు తెలిపింది.

అక్రమ నగదు బట్వాడా కేసులో సెంథిల్‌బాలాజీ సోదరుడికి సమన్లు

టి.నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బట్వాడా కేసులో మంత్రి సెంథిల్‌బాలాజీ సోదరుడు అశోక్‌కుమార్ ఏప్రిల్ 9న జరుగనున్న విచారణకు హాజరుకావాలంటూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు సమన్ జారీ చేసింది. 2011-15 సంవత్సరాల్లో అన్నాడీఎంకే ప్రభుత్వహయాంలో రవాణా శాఖమంత్రిగా పనిచేసిన సెంథిల్‌బాలాజీ ఆ శాఖలో కండక్టర్, డ్రైవర్ ఉద్యోగాలు వేయిస్తానంటూ నిరుద్యోగుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించాడని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సెంథిల్‌బాలాజీపై ఇప్పటికే 120 పేజీల ఛార్జిషీటు ఈడీ దాఖలు చేసింది. ఈ కేసులో సెంథిల్‌బాలాజీ సోదరుడు అశోక్‌కుమార్‌కు కూడా సంబంధాలున్నట్లు నిర్ధారించిన ఈడీ పలుమార్లు సమన్లు పంపినా విచారణకు హాజరుకాలేదు. కొన్నేళ్లుగా ఆయన అజ్ఞాతంలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అశోక్‌కుమార్, సెంథిల్ బాలాజీ మాజీ సహాయకుడు షణ్ముగం సహా 12 మందికి వ్యతిరేకంగా ఈడీ అదనపు ఛార్జిషీట్‌ను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో దాఖలు చేసింది. ఈ కేసు విచారణకు అశోక్ కుమార్ సహా 12 మంది విచారణకు హాజరుకావాలంటూ కోర్టు సమన్లు పంపింది.

రేపు మద్రాస్ వర్సిటీలో ఉగాది వేడుకలు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ యూనివర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ 'శ్రీ విశ్వావసు ఉగాది' వేడుకలు జరుగనున్నాయి. మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో ఉదయం 9.45 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో 'పెరంబూరు తెలుగు సాహితీ సమితి' కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం చేయనుండగా, ప్రముఖ సినీ రచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా , 'తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం' అధ్యక్షులు తమ్మినేని బాబు ప్రత్యేక అతిథిగా హాజరు కానున్నారు. కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం ఉపన్యసించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆచార్య లింగంనేని బసవ శంకరరావు విరచిత 'ఎల్.బి.యస్.రేడియో ప్రసంగాలు', డాక్టర్ టీఆర్ఎస్ శర్మ విరచిత 'ఉపనిషద్వింశతి', డాక్టర్ మాదా శంకరబాబు విరచిత 'ఈశా సాహితీ వ్యాసవాణి' పుస్తకావిష్కరణ జరుగనుంది. అనంతరం యోగాలయ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్‌కు 'తెలుగు శాఖ ఉగాది పురస్కారం' ప్రదానం చేయనున్నారు. మధ్యాహ్నం 'సూర్యకాంతం ఇష్టావధానం'ను జోస్యుల ఉమ చేయనుండగా, 'జనాభా లెక్కల ఝులక్'ను ఎస్‌పి వసంతలక్ష్మి, దామెర్ల సరస్వతి' ప్రదర్శించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు జరుగనున్న కవి సమ్మేళన సభకు తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనుండగా, తెలుగుభాషా సేవకురాలు డాక్టర్ ఏపీ శివకుమారి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ ప్రారంభోపన్యాసం చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎంఆర్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో గానలహరి సంగీత కార్యక్రమం జరుగనుంది. ఇందులో అరుణా శ్రీనాథ్, నడమర్తి వసుంధరా దేవి, వంజరపు శివయ్య, రవికుమార్, వల్లాప్రగడ స్రవంతి, విస్తాలి శంకరరావు గానాలాపన చేయనున్నారు.ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆచార్య విస్తాలి శంకరరావు విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వేడుకగా పంచాయతీ పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు సమీపం కల్లుగుట్ట గ్రామంలోని పంచాయతి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. బెడుగత్తూర్ పంచాయతి సెక్రటరీ తిరుమల్‌రాజు అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో పాఠశాల హెచ్‌ఎం భాస్కరన్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతి అధ్యక్షుడు బాలు పాల్గొని, వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బెడుగత్తూర్ టౌన్ పంచాయతి అధ్యక్షులు జయరావు, ఉపాధ్యాయులు వెంకటేశన్, భారతిరాజా, సంతోష్, ఆనైకట్టు కౌన్సిలర్లు కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గ్యాస్ ట్యాంకర్ లారీల సమ్మె

వాషర్‌మెన్‌పేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానుల సంఘం ప్రకటించింది. ప్రజా శాఖలోని ఆయిల్ సంస్థల బాట్లింగ్ యూనిట్లకు వంట గ్యాస్ తీసుకెళ్లేందుకు ట్యాంకర్ లారీలు వినియోగిస్తున్నారు. ఈ మేరకు ఆయిల్ సంస్థలతో ట్యాంకర్ లారీల యజమానులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుత సంవత్సరం నుంచి 2030 వరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయిల్ సంస్థలు ప్రకటించగా, అందులో కొన్ని షరతులు తమకు అనుకూలంగా లేవని లారీ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఆయిల్ సంస్థలు అంగీకరించకపోవడంతో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ విషయమై నామక్కల్ ట్యాంకర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరాజన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థ 2025-30 సంవత్సరానికి కొత్త ఒప్పందం ప్రకటించిందన్నారు. ఒప్పందంలోని కఠిన నిబంధనలు సడలించాలని చమురు సంస్థల అధికారులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ విషయమై ఈ నెల 24న ప్రకటిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ఇప్పటివరకు స్పందించలేదన్నారు. నష్టాలతో తాము లారీలు నడిపలేమన్నారు. ఒప్పందంలోని కఠిన నిబంధనలు సడలించాలని కోరుతూ గురువారం నుంచి సమ్మె చేపట్టనున్నామని, ఈ సమ్మె కారణంగా సుమారు 4 వేల ట్యాంకర్ లారీలు నిలిచిపోనున్నాయని, ఈ సమ్మెకు మద్దతు తెలుపాలని కోరుతూ ఇతర రాష్ట్రాల ట్యాంకర్ లారీల యజమానుల సంఘాలకు లేఖ రాసినట్లు సౌందరరాజన్ తెలిపారు.

మరో రెండు మెట్రో మార్గాలు

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) మెట్రో రైలు ప్రాజెక్ట్‌లో మరో రెండు కొత్త మార్గాల ఏర్పాటుకు ప్రణాళిక నివేదిక తయారీకి చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) టెండర్లు ఆహ్వానించింది. ఆ ప్రకారం, తాంబరం నుంచి వేళచ్చేరి మీదుగా గిండి వరకు 21 కి.మీ, లైట్ హౌస్ నుంచి హైకోర్టు వరకు 7 కి.మీ దూరం కలిపి రెండు కొత్త మెట్రో మార్గాలు ఏర్పాటుకానున్నాయి.

పరీక్ష కేంద్రంలో విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● ఉపాధ్యాయుడి అరెస్ట్

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షా కేంద్రంలో విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు కటకటాలపాలయ్యాడు. తిరుప్పూర్ పళనియప్ప నగర్‌కు చెందిన సంపత్‌కుమార్ (32) అమ్మాపాళయంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నాడు. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఓ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్‌గా పనిచేశాడు. మంగళవారం ప్లస్ టూ ఆఖరి పరీక్ష కావడంతో, సంపత్‌కుమార్ ఉన్న గదిలో ఆరుగురు విద్యార్థినులు సహా 11 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆ సమయంలో పరీక్షా కేంద్రంలోకి కాపీలు తీసుకొచ్చారా అంటూ సంపత్‌కుమార్, ఆరుగురు విద్యార్థినుల శరీర భాగాలు తడుముతూ వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. పరీక్ష తరువాత బయటకు వచ్చిన ఆ విద్యార్థినులు ఈ విషయాన్ని తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం ఫిర్యాదుతో పోలీసు అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ పాఠశాలకు చేరుకొని బాధిత విద్యార్థులను విచారించారు. విచారణలో సంపత్‌కుమార్ వేధింపులకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో, కొంగునగర్ మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి సంపత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

ప్యారీస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనావరంలో చెల్లిని ప్రేమించిన ఓ యువకుడిని హతమార్చిన కేసులో నిందితులు ముగ్గురికి చెన్నై సెషన్స్‌కోర్టు యావజ్జీవ జైలుశిక్ష విధించింది. పోలీసుల కథనం మేరకు అయనావరం రైల్వే క్వార్టర్స్‌కు చెందిన శ్రీనివాసన్ కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన వినోద్ అనే యువకుడు ప్రేమిస్తున్నట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసన్ కుమారుడు అక్షయ్‌కుమార్ (17) తన చెల్లిని ప్రేమించిన వినోద్‌ను హతమార్చేందుకు పథకం రూపొందించాడు. ఇందుకోసం తన మిత్రులైన సంతోష్ (25), సుబ్రమణ్యరాజ్ (24), డేవిడ్ (19), మదన్ (26)లతో కలిసి 2011వ సంవత్సరం వినోద్‌పై మూకుమ్మడిగా దాడి చేసి హత్యచేసినట్లు శ్రీనివాసన్ ఐసీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసుపై బుధవారం మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోని సెసెన్స్ కోర్టు న్యాయమూర్తి రాజ్‌కుమార్ తీర్పుచెప్పారు. ఇందులో అక్షయ్‌కుమార్ మైనర్ కావడంతో అతడిని రెండేళ్లు చిన్నారుల సంరక్షణ కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. నిందితుల్లో ఒకరైన మదన్ మరణించడంతో అతడిని కేసు నుండి విడుదల చేసిన న్యాయమూర్తి, మిగిలిన ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్ష, తలా రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మహిళకు 15 ఏళ్లు... యువకుడికి 8 ఏళ్లు...

దిండుగల్ జిల్లా వత్తలగుండు సమీపంలో ఓ యువకుడికి నిప్పంటించి హతమార్చిన కేసులో మహిళకు 15 ఏళ్ళు, మరో యువకుడికి 8ఏళ్ళ జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పుజెప్పింది. పోలీసుల కథనం మేరకు 2022వ సంవత్సరం వత్తలగుండు సమీపంలోని చెన్నార్‌పట్టి ప్రాంతానికి చెందిన వనరాజా (40)ను ఆస్తి తగాదాల కారణంగా మదురై జిల్లా వుసిలపట్టికి చెందిన రాజేష్ (35), నిత్య (33) అతడి శరీరంపై పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేశారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. ఈ నేపథ్యంలో దిండుగల్ ప్రిన్సిపల్ సెసెన్స్ కోర్టులో సాగిన ఈ కేసు విచారణ పూర్తికావడంతో బుధవారం ఉదయం న్యాయమూర్తి సుబ్రమణియన్ తీర్పు వెలువరించారు. ఇందులో నిత్యకు 15ఏళ్ళ జైలుశిక్ష, రూ.11,500 జరిమానా, మరో నిందితుడు రాజేష్‌కు 8ఏళ్ళ జైలుశిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

40 సవర్ల దోపిడీ కేసులో ఏడుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగలు, పట్టుబడిన నిందితులు

వేలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి మేట్టుకులం ప్రాంతంలో జరిగిన 40 సవర్ల దోపిడీ కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. మేట్టుకులం ప్రాంతానికి చెందిన రాజా, ఈ నెల 20న తన కుమార్తె వివాహం కోసం కొత్త బట్టల కొనుగోలుకు చెన్నై వెళ్లాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి 40 సవర్ల నగలు, 500 గ్రాముల వెండి వస్తువులు దోచుకొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు, తిరువణ్ణామలై సమీపం పెరుమాళ్‌నగర్‌కు చెందిన వెంకటేష్, సేలం జిల్లా చిన్నకలవరాయన్‌మలై శరవణన్, ఆరణి భారతి, వేలూరు సెన్‌పాక్కం త్యాగరాజన్, తిరువణ్ణామలై జిల్లా సతీష్, గోపి, సేలం పుష్పరాజ్ తదితరులను అరెస్ట్ చేసి, వారి నుంచి 36 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఎస్ఆర్ కణ్ణన్‌కు మాతృవియోగం



తామరైసెల్వి (ఫైల్‌ఫొటో)


అడయార్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాతతరం నటుడు, దివంగత ఎస్ఎస్ఆర్ సతీమణి, సినీ నటుడు ఎస్ఎస్ఆర్ కణ్ణన్ తల్లి తామరైసెల్వి అలియాస్ రాజకుమారి (70) బుధవారం ఉదయం కన్నుమూశారు. తేనాంపేటలోని ఎల్డామ్స్ రోడ్డులో నివశించే ఆమె వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. ఆమె అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

వృద్ధురాలి నేత్రదానం

వేలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం ధర్నాపేటకు చెందిన శివభూషణం అమ్మాళ్ (87) బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె చివరి కోరికగా కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను చెన్నై అగర్వాల్ ఆస్పత్రి, రీసెర్చ్ కేంద్రానికి దానంగా అందజేశారు. నేత్రదానం చేసిన శివభూషణం అమ్మాళ్ కుమారులు తమిళ్‌సెల్వన్, గోవిందన్‌ను ఆసుపత్రి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్



పాఠశాల ప్రాంగణంలో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తిరుత్తణి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్. చంద్రన్ పిలుపునిచ్చారు. తిరువళ్లూరు జిల్లా అధిమాం జేరిపేట ప్రభుత్వ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో బ్యాడ్మింటన్ కోర్టును బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పల్లిపట్టు యూనియన్ ఇన్‌ఛార్జీ బీడీ.చంద్రన్, ఆర్కేపేట డీఎంకే కార్యదర్శి సీఎన్.షణ్ముగం, జిల్లా విద్యార్థి సంఘం నిర్వాహకుడు మురళీ సేన, పీటీ.కుమరేశన్, ఎం.శివకుమార్, వీవీ.మణి, ఎంకే.సురేష్, పీటీ.రాజేంద్రన్, ఈఎస్.సుందరం, ఆర్.మణికందన్, కే.దేవరాజ్, జీ.ఆరోన్, పి.సంపత్, పి.రామచంద్రన్, జి.వినాయగన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో ల్యాప్‌టాప్‌ల చోరీ

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో 53 ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన వ్యవహారంపై పోలీసులు విచారణ చేపట్టారు. చెంగల్పట్టులోని ఓ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చేందుకు తెప్పించిన ల్యాప్‌టాప్‌లు ఓ గదిలో ఉంచారు. ఈ క్రమంలో ఆ ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు గుర్తించిన పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఆడియో రిలీజ్ వేడుకలో మాధవన్, సిద్ధార్థ్, శశికాంత్ తదితరులు

స్పోర్ట్స్ డ్రామాగా 'టెస్ట్'

● దర్శకుడు శశికాంత్

తన స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'టెస్ట్' మూవీ స్పోర్ట్స్ డ్రామా స్టోరీ అని, ఒక కుటుంబం అందులోని ప్రధాన పాత్రధారలు ఎదర్కొనే సమస్యలు, సవాళ్ళతో రూపొందించినట్టు ఆ చిత్ర దర్శకుడు ఎస్.శశికాంత్ తెలిపారు. ఆర్.మాధవన్, నయనతార, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. వైనాట్ స్టూడియో పతాకంపై నిర్మాత ఎస్.శశికాంత్ నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ తాజాగా నగరంలో జరిగింది. ఇందులో శశికాంత్ మాట్లాడుతూ, 'సినిమాల్లో దర్శకత్వం చేయాలనే ఉద్దేశ్యంతో సినిమాల్లోకి వచ్చాను. కానీ, అది ఎలా చేయాలో తెలియక దర్శకత్వం నేర్చుకునేందుకు వైనాట్ స్టూడియో స్థాపించి పలు చిత్రాలను నిర్మించి, దర్శకత్వంలోని మెళకువలను గ్రహించాను. ఈ మూవీలోని పాత్రలను అర్థం చేసుకునేందుకు ఎంతో పరిణితి చెందిన నటీనటులు అవసరం. అందుకే అగ్రనటీనటులను ఎంపిక చేశాం. ఈ టెస్ట్ మూవీ నాకే అనేక టెస్ట్‌లు పెట్టింది. అందుకే ఈ సినిమా విడుదలకు చాలా సమయం పట్టింది' అని అన్నారు. ఆర్.మాధవన్ మాట్లాడుతూ, 'నేను పోషించే పాత్ర హీరోనా, విలనా అనే విషయాన్ని పక్కనబెట్టి.. ఆ పాత్రకు ఏ మేరకు న్యాయం చేయగలనో ఆలోచన చేస్తాను. ఆ విధంగా ఆలోచన చేస్తే 'టెస్ట్' మూవీలోని పాత్ర నాకు ఒక సవాల్‌గా నిలిచిందన్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, ' దేశంలో క్రికెట్ అనేది ఒక జీవితంలా మారిపోయింది. ఎవరిని అడిగినా క్రికెట్ అంటే ఇష్టమని చెబుతారు. అలాంటి వారిలో నేనూ ఒకడిని. టెస్ట్ క్రికెటర్ పాత్రలో నటించడం అంత ఈజీ కాదు. అనేక మందిని స్ఫూర్తిగా తీసుకుని ఈ పాత్రలో నటించాను. నాకు రాహుల్ ద్రవిడ్ ఎంతో ఇష్టం. ఆయనకు నా పాత్రను అంకితం చేస్తున్నాను' అని పేర్కొన్నారు. నటి మీరా జాస్మిన్ మాట్లాడుతూ, 'నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది.చాలా మంచి కథ. ప్రతి ఒక్కరూ చూడాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి



మే డే రోజున 'టూరిస్ట్ ఫ్యామిలీ'



'టూరిస్ట్ ఫ్యామిలీ'లో శశికుమార్, సిమ్రన్

శశికుమార్ - సిమ్రన్ జంటగా నటించిన తాజా చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' మే డే రోజున విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. డెబ్యూ డైరెక్టర్ అభిషాన్ జీవింత్ దర్శకుడు. శశికుమార్, సిమ్రన్‌తో పాటు మిథున్ జయశంకర్, కమలేష్, యోగిబాబు, రమేష్ తిలక్, ఎంఎస్ భాస్కర్, బక్స్ తదితరులు నటించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీని మిలియన్ డాలర్ స్టూడియో, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే మూవీ టైటిల్ టీజర్ రిలీజ్ కాగా మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు.



రొమాంటిక్ కామెడీ చిత్రంలో

నటించాలని ఉంది

● శాన్వి మేఘన

తనకు రొమాంటిక్ కామెడీ, స్పై థ్రిల్లర్, యాక్షన్ జోనర్ చిత్రాల్లో నటించాలని ఉందని యువ హీరోయిన్ శాన్వి మేఘన అంటున్నారు. మణికంఠన్ హీరోగా వచ్చిన చిత్రం 'కుడుంబస్తన్'. ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ మూవీ విజయంతో హీరోయిన్ శాన్వి.. వెన్నెల పాత్రలో నటించి, చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇపుడు శాన్వికి వరుస అవకాశాలు వస్తున్నాయి. అయితే, కుటుంబ కథా నేపథ్యంతో కూడిన పాత్రలే వస్తున్నాయి. ఈ విషయంపై శాన్వి మాట్లాడుతూ, "కుడుంబస్తన్' మూవీలో వెన్నెల పాత్ర నాకు ఎంతో మంచి పేరు తెచ్చిపెట్టింది. అనేక మంది ఈ పాత్రలో తమను తాము చూసుకున్నారు. ఇపుడు అదే తరహా పాత్రలు వస్తున్నాయి. ఇది ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. అయితే, నాకు మాత్రం యాక్షన్, స్పై థ్రిల్లర్, స్పోర్ట్స్, రొమాంటిక్ కామెడీ వంటి చిత్రాల్లో నటించాలని భావిస్తున్నాం. ఈ తరహా పాత్రల్లో నటించడం వల్ల నాలోని ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉంటుంది' అని పేర్కొన్నారు.

హిట్ కోసం ఎదురుచూస్తున్న విశాల్!



హీరో విశాల్ సరైన హిట్ కోసం పరితపిస్తున్నారు. ఈయన నటించిన 'మదగదరాజా' చిత్రం 12 యేళ్ళ తర్వాత విడుదలైన విజయం సాధించినప్పటి ఆ క్రెడిట్ మొత్తం విశాల్‌కు దక్కలేదు. విశాల్‌తో కలిసి నటించిన హాస్య నటుడు సంతానం, దర్శకుడు సుందర్ ప్రధాన కారణమంటూ ప్రచారం సాగింది. దీంతో విశాల్ సోలో హీరోగా సరైన హిట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తన తదుపరి చిత్రాన్ని రవి అరసు దర్శకత్వంలో చేసేందుకు నిర్ణయించుకున్నారు. నిజానికి పలువురు దర్శకుల వద్ద కథలను ఆలకించిన విశాల్.. చివరకు రవి అరసు చెప్పిన స్టోరీ నచ్చడంతో ఒకే చెప్పారు. కాగా, రవి అరసు గతంలో 'ఈటి', 'ఐంగారన్' వంటి హిట్ చిత్రాలను రూపొందించారు. ఇదిలావుంటే, విశాల్ చివరిసారిగా 'రత్న' మూవీలో నటించారు. హరి దర్శకత్వం వహించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద నిరాశకు లోనుచేసింది.

ట్రాఫిక్ పోలీసులకు 'సన్ గ్లాసెస్'

● అందజేసిన కమిషనర్ అరుణ్



సన్ గ్లాస్ అందజేస్తున్న నగర పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు విభాగంలో పనిచేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు 'సన్ గ్లాస్' అందజేశారు. వెప్పేరిలోని కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని, 1,500 మంది ట్రాఫిక్ పోలీసులకు సన్ గ్లాస్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'స్పెస్ మేకర్స్' ద్వారా కళ్ళపై సూర్యకిరణాలు పడకుండాను, చల్లగా ఉండేలా రూపొందించిన సన్ గ్లాస్ ధర రూ.1,990 అని, ట్రాఫిక్ పోలీసులకు వీటిని అందించేందుకు రూ.29.85 లక్షలు ఖర్చుచేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం అడిషినల్ కమిషనర్ ఆర్.సుధాకర్, సౌత్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ బండి గంగాధర్, నార్త్ ట్రాఫిక్ విభాగం డిప్యూటీ కమిషనర్ విశ్వేష్ బి.శాస్త్రి, ఈస్ట్ ట్రాఫిక్ విభాగం డిప్యూటీ కమిషనర్ వి.భాస్కరన్, సౌత్ ట్రాఫిక్ విభాగం డిప్యూటీ కమిషనర్ పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 మంది పేద చిన్నారులకు

ఉచిత విమాన ప్రయాణం



చెన్నై విమానాశ్రయంలో చిన్నారులు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విమానం ఎక్కాలన్న 25 మంది నిరుపేద చిన్నారుల స్వప్నాన్ని కొన్ని స్వచ్ఛంద సంస్థలు నెరవేర్చాయి. మద్రాస్ రౌండ్ టేబుల్-95, మద్రాస్ మెట్రో లేడీస్ సర్కిల్-70, కోయంబత్తూరు ఏసీ ఎంఈ రౌండ్ టేబుల్-133, కోయంబత్తూరు పెంటా రౌండ్ టేబుల్-101, తిరుపూర్ రౌండ్ టేబుల్-116 జెమ్ హాస్పిటల్ మద్దతుతో సంయుక్తంగా చేపట్టాయి. మంగళవారం కోయంబత్తూరు నుంచి చెన్నై తీసుకొచ్చి, తిరిగి వారి స్వస్థలానికి చేర్చాయి. పిల్లలు తొలిసారిగా విమానం ఎక్కడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండాపోయింది. ఈ కార్యక్రమానికి రౌండ్‌టేబుల్స్ అధ్యక్షులు టీఆర్ వరుణ్ ఆనంద్‌తో పాటు నిర్వాహకులు సుభాష్, పార్తీపన్, మోహన్‌రాజ్, కుమానల్, విజయ్ తదితరులు సహకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద పిల్లల కలల్ని సాకారం చేయడం తమకెంతో ఆనందంగా వుందని పేర్కొన్నారు.

మానవత్వాన్ని చాటేదే రంజాన్ మాసం

● మత సామరస్యానికి ప్రతీకగా 'ఇఫ్తార్'



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, డాక్టర్ సునీల్, మాజీ ఎంపీ జయవర్ధన్ తదితరులు

ప్యారీస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో మంచిని ప్రేమించాలని, మానవత్వాన్ని చాటిచెప్పాలని, కష్టాల్లోవున్న వారికి సహాయపడాలని బోధిస్తారని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రార్థనలు చేస్తారని అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మెన్ డాక్టర్ తమిళ్ మగన్ హుస్సేన్ పేర్కొన్నారు. రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా టినగర్‌లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి సూచన మేరకు మంగళవారం సాయంత్రం ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ అధ్యక్షతన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ తమిళ్ మగన్‌హుస్సేన్ ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసి మతసామరస్యాన్ని చాటిన డాక్టర్ సునీల్‌ను అభినందించారు. ఇఫ్తార్‌లో మాజీ ఎంపీ డాక్టర్ జె.జయవర్ధన్, హాజీ బషీర్ అహ్మద్, డాక్టర్ ఉమర్ షరీఫ్, షా నవాజ్, జాకీర్ హుస్సేన్, జమాల్ భాయ్, ఎంఏ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలకు డాక్టర్ సునీల్ నూతన వస్త్రాలు, బిరియాని తదితరాలను పంపిణీ చేశారు.

మనోజ్‌కు కోలీవుడ్ కన్నీటి వీడ్కోలు

● తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు

● ముగిసిన అంత్యక్రియలు



మనోజ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కార్డియాక్ అరెస్ట్ కారణంగా హఠాన్మరణం చెందిన దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఏకైక కుమారుడు, నటదర్శకుడు మనోజ్‌కు కోలీవుడ్ కన్నీటి నివాళి సమర్పించింది. నీలాంగరై సమీపంలోని పనైయూరులోని భారతీరాజా నివాసానికి మనోజ్ భౌతికకాయాన్ని మంగళవారం రాత్రి తరలించి, సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. మనోజ్ భౌతికకాయానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలైతో పాటు చిత్రపరిశ్రమకు అనేక మంది సినీ రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. కొన్ని నెలల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మనోజ్ మంగళవారం సాయత్రం కార్డియాక్ అరెస్ట్‌కు గురయ్యారు. వెంటనే స్థానికంగా ఉండే ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో భౌతికకాయాన్ని మొదట సొంతింటికి తరలించారు. తన కుమారుడు మృతివార్తను తెలుసుకున్న తండ్రి, సినీ దర్శకుడు భారతీరాజా హుటాహుటిన చెట్‌పేట్‌కు చేరుకుని దుఃఖసాగరంలో మునిగిపోయారు. బిడ్డ పార్థివదేహాన్ని చూసిన భారతీరాజా... 'రే మనోజ్.. లేచి రారా.. నాన్నతో మాట్లాడరా' అంటూ శవపేటిక పైపడి రోధించారు. ఆ తర్వాత కుమారుడి భౌతికకాయాన్ని నీలాంకరైలోని తన నివాసానికి తరలించి సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు.

క్యూకట్టిన తారాలోకం...

భారతీరాజా నివాసంలో ఉంచిన మనోజ్ పార్థివదేహానికి నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి, ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రహ్మణ్యంతో పాటు అగ్రహీరోలు విజయ్, సూర్య, శరత్ కుమార్, సూరి, దర్శకుడు మణిరత్నం, నటుడు నాజర్, ప్రముఖ నిర్మాతలు కలైపులి ఎస్.థాను, సురేష్ కామాక్షి, సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్, మాజీ సీఎం జయలలిత నెచ్చెలి వీకే శశికళ, తమిళ విమోచన ఉద్యమ నేతపళనెడుమారన్ తదితరులు మనోజ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారుడిని కోల్పోయి శోకసముద్రంలో మునిగివున్న భారతీరాజాను సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి కలిసి ఓదార్చి, తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతి తెలిపారు. అలాగే, తన నివాసం పక్కనే భారతీరాజా ఇల్లు ఉండటంతో హీరో విజయ్ తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్ళి మనోజ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అదేవిధంగా ఏ కార్యక్రమం జరిగినా తన ప్రారంభ ప్రసంగంలో 'ఎన్ ఇనియ తమిళ్ మక్కళే' అంటూ గంభీరంగా పలికే భారతీరాజా గొంతు ఇపుడు ఏకైక కుమారుడిని కోల్పోవడంతో మూగబోయింది. మరోవైపు, మనోజ్ మృతికి సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు తమ సంతాప సందేశాలను వెల్లడించారు. కాగా, మనోజ్ భౌతికకాయాన్ని పనైయూర్ నుంచి బీసెంట్ నగర్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్ళి విద్యుత్ దహన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.



భారతీరాజాను ఓదార్చుతున్న సీఎం

సీటీఏ ఆధ్వర్యంలో 30న శ్రీ విశ్వావసు ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న చెన్నై తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి సంస్థ నిర్వాహకులు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలోని చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 30న శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసినమీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధురవాయల్ ఏరిక్కరై పూందమల్లి హైరోడ్డులో ఆలపాక్కం మెయిన్‌రోడ్డుకు ఎదురుగా ఉన్న సీతాలక్ష్మీ తిరుమణ మండపంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి చెన్నై ఆదాయపు పన్నుల శాఖ కమిషనర్ డి. కోమలి కృష్ణ ముఖ్య అతిథిగా, సినీ గేయరచయిత భువనచంద్ర, సినీనటి సుధ, సినీ నటుడు నరసింహరాజు, కేంద్ర ప్రతిభాపాటవాల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్ రీజినల్ డైరెక్టర్ (చెన్నై) కే శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం పూజ తర్వాత ఆంజనేయశాస్త్రి పంచాంగ పఠనం చేస్తారని చెప్పారు. 5 గంటలకు కల్పనా శ్రీనివాస్ విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన, 5.30 గంటలకు ప్రముఖ సినీ గాయకుడు రాము, శ్రీవర్ధిని లలిత సంగీత కార్యక్రమం, రాత్రి 7.05 గంటలకు సంస్థ అధ్యక్షుడి స్వాగతోపన్యాసం ఉంటుదన్నారు. ఈ కార్యక్రమాలకు ఏవీ శివకుమారి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారని చెప్పారు. రాత్రి 8.30 గంటలకు ఉగాది విందు భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా నగరంలోని తెలుగువారికోసం ప్రతియేటా ఉగాది వేడుకలు, శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించడంతోపాటు రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయాల పంపిణీ వృద్ధాశ్రమంలో సహాయాల పంపిణీ, వనభోజన కార్యక్రమాలను కూడా చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఉగాది వేడుకలకు కూడా నగరంలోని తెలుగువారంతా తప్పకుండా హాజరై సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని గోపాలకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సంస్థ సభ్యులు ఎం. రామయ్య, ఆర్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

30న ఎస్కేపీడీ దేవస్థానంలో ...

ప్యారీస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో ఈ నెల 30న శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు పవిత్రజల పుష్పకలశాల ఊరేగింపు, పంచాంగ పఠనం, 6.45 గంటలకు సామూహిక వాసవీ అష్టోత్తర అర్చన, రాత్రి 7.15 గంటలకు 102 దీపాలతో దీపారాధన, 7.30 గంటలకు 150 గంపల పూలతో పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో అమ్మవారి భక్తులందరూ పాల్గొని ఆశీస్సులందుకోవల్సిందిగా ఎస్కేపీడీ ఛారటీస్ ట్రస్టీలు పిలుపునిచ్చారు.

ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో....

ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 30 న ఉగాది వేడుకలు జరగనున్నాయి. కొరట్టూరు అగ్రహారం, అన్నై అవెన్యూలో వున్న కోదండ రామాలయం కమ్యూనిటీ హాలులో ఆంధ్రకళా స్రవంతి అధ్యక్షులు జేఎం. నాయుడు అధ్యక్షతన జరిగే వేడుకల్లో సీనియర్ అడ్వకేట్ ఆర్ఎస్ జీవరత్నం ముఖ్యఅతిథిగా, ఛార్టెడ్ ఇంజనీర్ భోజనాల నాగరాజ గుప్తా, జేపీన్ చిట్‌ఫండ్స్ ఎండీ డా.ఎంవీ నారాయణ గుప్తా విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. సాయంత్రం 4 గంటలకు వేదపండితులు సుసర్ల కుటుంబశాస్త్రి పంచాంగ పఠనం చేసిన అనంతరం, ఉగాది పురస్కారం, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు, ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతిభావంతులైన మహిళలకు అవార్డుల ప్రదానం



మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శ్రీలక్ష్మి మోహన్‌రావు



స్మృతి ఇరానీతో అవార్డు గ్రహీతలు

● శ్రీలక్ష్మి మోహన్ రావుకు ప్రత్యేక పురస్కారం

అడయార్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ)కు 13 యేళ్ళ పాటు సుదీర్ఘకాలం కోశాధికారిగా విశేష సేవలందించిన ప్రపంచ తెలుగు సమాఖ్య సెక్రటరీ జనరల్ శ్రీలక్ష్మి మోహన్‌రావు మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా ప్రత్యేక గుర్తింపు అవార్డును అందుకున్నారు. ఫిక్కీ ఫ్లో(చెన్నై) చైర్‌పర్సన్ డాక్టర్ దివ్య అభిషేక్ ఆధ్వర్యంలో మహిళా సాధకుల గుర్తింపు, వార్షిక్ ఛేంజ్ ఆఫ్ గార్డ్ కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. ఇందులో స్మృతి ఇరానీ, ఫిక్కీ వైస్ ప్రెసిడెంట్, ది సన్మార్ గ్రూపు చైర్మన్ విజయ్ శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తూ సమాజానికి సేవ చేస్తున్న ఎనిమిది మంది మహిళా సాధకులను గుర్తించి వారికి 'ఎఫ్ఎల్ఓ ఉమెన్స్ అచీవర్స్-2025' పేరుతో అవార్డులు అందజేశారు. ఇందులో ఔట్‌స్టాండింగ్ ప్రొఫెషనల్ అవార్డును శుభశ్రీ శ్రీరామ్, కవిత విజయ్, ఔట్‌స్టాండింగ్ సోషల్ ఎంటర్‌ప్రిన్యువర్ ఇండివిజువల్ అవార్డును శ్రేయ జైన, ఔట్‌స్టాండింగ్ సోషల్ ఎంటర్ ప్రెన్యువర్ (ఎన్‌జీవో)ను మది ఫౌండేషన్, అప్‌కమింగ్ ఎంటర్‌ప్రిన్యువర్ అవార్డును మానుషి అశోక్ జైన్, ఎంటర్‌ప్రిన్యువర్ అవార్డు (5 యేళ్ళ కంటే ఎక్కువ)ను రమేష్ బుధియా, ఎంటర్‌ప్రెన్యువర్ స్పెషల్ రికగ్నేషన్ అవార్డును షాలిని అరుణ్, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును డాక్టర్ ఎస్.గీతాలక్ష్మి (వైస్ ఛాన్సలర్)లకు మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

పుదుచ్చేరి మహిళల కోసం

చెన్నైలో 2 హాస్టళ్లు

● పుదువై మంత్రి జయకుమార్



పుదుచ్చేరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి నుంచి చెన్నై వెళ్ళి చదువుకుంటున్న విద్యార్థినులు, ఉద్యోగాలు చేస్తున్న మహిళల కోసం రెండు హాస్టళ్లను నిర్మించేందుకు రూ.40 లక్షలు కేటాయించినట్లు ఆ రాష్ట్రమంత్రి తేనీ జయకుమార్ పేర్కొన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీలో బుధవారం వార్షిక బడ్జెట్‌లోని వివిధ అంశాలపై జరిగిన చర్చలో పలువురి ఎమ్మెల్యేలు కొత్త పథకాల గురించి ప్రశ్నించారు. వారికి మంత్రి తేనీ జయకుమార్ సమాధానం చెబుతూ, ముఖ్యమంత్రి రంగస్వామి నేతృత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుదుచ్చేరి రూపురేఖలు మారిపోయాయని, ముఖ్యంగా మహిళలు విద్యా, ఆర్థిక పరంగా అభివృద్ధి చేందేలా పథకాలను రూపొందించి ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. మార్చి వరకు మహిళాభివృద్ధిశాఖలో 13మంది ఆర్గనైజర్లను నియమించారని, త్వరలో మరో 31మంది సహాయకులకు పదోన్నతి కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. పుదుచ్చేరి నుండి చెన్నై వెళ్ళి చదువుకుంటున్న విద్యార్థినులు, మహిళల కోసం రెండు హాస్టళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మహిళాభివృద్ధి శాఖ ద్వారా 5 నుండి 18 ఏళ్ళలోపు మరణించే ఆడపిల్లల అంతక్రియలకు ఈ ఆర్థిక సంవత్సరం నుండి రూ.15వేలు అందించనున్నట్లు మంత్రి సభకు వివరించారు.





శ్రీవారి సేవలో ప్రముఖులు

చోటా కె నాయుడు, వశిష్ట - జస్టిస్ శివసుబ్రహ్మణ్యం

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు వశిష్ట, సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు, నటి దివి, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దివి

ఎస్వీయూ బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కేరళ కారైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ నెల 29న జరగనున్న ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ మహిళా జట్టు ఎంపికైంది. బుధవారం ఎస్వీయూ వ్యాయామ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. టోర్నమెంటులో రాణించాలని ఆకాంక్షించారు. టీం కోచ్‌గా డాక్టర్ డి.రెడ్డిభాస్కర్, మేనేజర్‌గా ఎ.నరసింహారావు వ్యవహరించనున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి ఉన్నాయి. క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,252

తలనీలాలు సమర్పించినవారు: 25,943





తిరుపతి శ్రీ కోదండరామాలయం

రాములోరి వేడుకలకు రారండోయ్..

● నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతిలోని కోదండ రామాలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 4వరకూ జరిగే ఈ వేడుకల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు చలువ పందిళ్లు వేశారు. ఆలయం, మాడ వీధులకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు కోదండరామయ్య వాహనాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ప్రాచీనమైన తిరుపతి కోదండరామాలయం విశేషాలు..

-తిరుపతి(టీటీడీ), ఆంధ్రజ్యోతి

ప్రాచీన కాలం నాటిది కోదండరామాలయం. విశేష చరిత్ర ఉన్న ఈ ఆలయం తొలినాళ్లలో తిరుపతికి ఉత్తరాన ఉండేది. ఊరు విస్తరించడంతో ప్రస్తుతం నగరం మధ్యన దర్శనమిస్తోంది. ఆలయానికి సంబంధించి అచ్యుతరాయల కాలంలో కుమార రామానుజ అయ్యంగార్ వేయించిన శాసనమొకటి లభించింది. క్రీ.శ.1480లో సాళువ నరశింహుడి కాలంలో శఠగోపదాసర్ నరసింహాచార్య మొదలియార్ కోదండ రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్లు శాసనం ద్వారా తెలుస్తుంది. అంతకుముందే ఆలయంలో స్వామి విగ్రహాన్ని జాంబవంతుల వారు ప్రతిష్ఠించారనేది ఐతిహ్యం. రామచంద్ర పుష్కరిణి ఉన్న ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు లభించడంతో జనమేజయ చక్రవర్తి ఆలయంలో తరువాత కాలంలో పునరుద్ధరించారని టీటీడీ పలు పుస్తకాల్లో ముద్రించింది.

తిరుమలను తలపించేలా..

తిరుమలకు, రామచంద్రమూర్తికి అనుబంధముందని ఇతిహాసం చెబుతుంది. రామచంద్రుడు సీతాన్వేషణ సఫలమవ్వడం కోసం స్వామి పుష్కరిణిలో స్నానమాచరించినట్లు, అందుకు గుర్తుగా తిరుమల ఆలయంలో సీతారాముల విగ్రహాలు ఉన్నాయని భవిష్యోత్తర పురాణంలో ప్రస్తావన ఉంది. తిరుమల ఆలయంలోని విగ్రహాలకు జడధారులు ఉండడం గమనించవచ్చు. శ్రీరాముల వారు, ఎక్కడ లేని విధంగా కుడి వైపున సీతాదేవి,ఎడమ వైపున లక్ష్మణ విగ్రహాలు ఉంటాయి. తిరుమల తరహాలోనే కోదండరామాలయంలో స్వామి, అమ్మవార్లు, అర్చనామూర్తులుగా దర్శనమిస్తారు. వైకుంఠ ద్వారాల మాదిరిగానే సువర్ణమయమైన గర్భగుడి ముందు జయవిజయులు ద్వారపాలకులుగా కనిపిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు

తేదీ	ఉదయం	రాత్రి
27.03.2025	ధ్వజారోహణం (ఉదయం 9.15 నుంచి 9.30 వరకు)	పెద్దశేష వాహనం
28.03.2025	చిన్నశేష వాహనం	హంస వాహనం
29.03.2025	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
30.03.2025	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
31.03.2025	పల్లకి ఉత్సవం	గరుడ వాహనం
01.04.2025	హనుమంత వాహనం	గజ వాహనం
02.04.2025	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
03.04.2025	రథోత్సవం	అశ్వవాహనం
04.04.2025	చక్రస్నానం	ధ్వజావరోహణం

టీటీడీ పర్యవేక్షణ

తొలినాళ్ల నుంచి కోదండ రామాలయం స్వతంత్రంగా లేదు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండేది. ఆ ఆలయ అధికారులే దీనిని పర్యవేక్షించేవారు. విజయనగర సామ్రాజ్యంలోని ఉదయగిరి నుంచి వేద పండితులు అర్చకులుగా పనిచేసేవారు. వారి కుటుంబాలకు ఆలయం సమీపంలోనే నివాసవసతి ఉండేది. సువిశాల రాతి గోడలతో, ప్రశాంత వాతావరణంలో ఉండేది. గుడి లోపలి వరుసలో చక్కటి ఉద్యానవనం ఉంది. ఊంజల మండపం, యాగశాల, పోటు వంటివి ఆలయంలోనే నిర్మించారు. ఎత్తయిన రాజగోపురానికి నేరుగా సన్నిధి వీధి చివర దీప స్తంభముండేది. మహంతుల తర్వాత టీటీడీ ఆలయ బాధ్యతలను చేపట్టింది.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వాహనాలు



రంగులు అద్దుతున్న కళాకారులు

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించండి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి(టీటీడీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. అన్నమయ్య వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. అనంతరం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, నారాయణ, మహేష్, రజని తదితరులు పాల్గొన్నారు.

సెటిల్‌మెంట్లు.. భూదందాల్లో 'హెడ్'!

● ఎనిమిదేళ్లుగా ఒకే స్టేషన్‌లో తిష్ట



తిరుపతి(నేరవిభాగం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను బట్టి సెటిల్‌మెంట్లు.. భూదందాలు చేయడంలో ఆయన 'హెడ్' అంట. తిరుపతి సమీపం.. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఎనిమిదేళ్లుగా తిష్ఠవేసిన ఆయనపై తీవ్ర విమర్శలున్నాయి. గత ఐదేళ్లు ఆయన మాటే వేదంగా నడిచింది. అధికారులు సైతం అతడికి అడ్డం చెప్పలేని పరిస్థితులు ఉండేవంటారు. ఎవరైనా అధికారులు ఇతడి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తే.. తన పలుకుబడితో వారిపైనే చర్యలు తీసుకునేట్లు చేస్తాడని అంటారు. గతంలో అదే పోలీసు స్టేషన్ నుంచి ఒక అధికారిని ఇతడు బదిలీ చేయించాడంటూ పోలీసు వర్గాలు ఉదాహరణగా చెబుతాయి. ఇక, గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాకు ఈయన రూట్ అధికారిగా వ్యవహరించాడనే ఆరోపణలున్నాయి. అప్పటి ప్రజాప్రతినిధి చెప్పినట్లు చేస్తూ.. మట్టి, ఇసుక అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించేవాడని, అలా రూ.కోట్లు వెనకేసుకున్నట్లు విమర్శలున్నాయి. అక్కడ కానిస్టేబుల్ స్థాయిలో రైటర్‌ను నియమించి తెరవెనుక చక్రం తిప్పుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీంతో ప్రతి ఫిర్యాదుదారు ఈయన్ను కలవాల్సిందేనట. ఈయన చెప్పినట్లు వింటే ఎఫ్ఐఆర్ అవుతుందట. ఎందుకంటే రైటర్ ఉన్నా.. కేసులు నమోదు చేసేది ఈయనేనని అక్కడి పోలీసులు చెబుతున్నారు. ఇక, ఓ దాబాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డే లేకుండా పోవడం వెనుక ఈయన ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి. ఓ భూతగాదాకు సంబంధించి కేసు రెఫర్ (కేసు లేకుండా చేయడం) చేస్తానని 'ఒప్పందం' కుదుర్చుకొని రెండేళ్లయినా చేయలేదంటారు. తన డబ్బు ఇచ్చేయమని ఆ కేసులో నిందితుడు అడగ్గా.. బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు ఫైలును ఉన్నతాధికారులకు పంపకుండా చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలా ఇతడిపై ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కూటమి అధికారంలోకి వచ్చినా ఆయన దందా మాత్రం యథేచ్ఛగా సాగిపోతోందట. ఇన్ని ఆరోపణలున్న ఇతడు ఎనిమిదేళ్లుగా ఇదే స్టేషన్‌లోనే ఎందుకు ఉన్నారంటూ ఓ ఉన్నతాధికారి ఇటీవల ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఇక్కడ పని తెలిసిన వారు ఎవరూ లేరు సార్. ఎఫ్ఐఆర్ అయినా ఆయనొక్కడే రాయగలడు. కేసులు కట్టగలడు' అంటూ అక్కడి అధికారి వత్తాసు పలికినట్లు విశ్వసనీయ సమాచారం.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఎనిమిదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అవినీతి ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటాం. దీనిపై ఎస్పీకి నివేదిక సమర్పిస్తా. భూతగాదా విషయం నా దృష్టికి వస్తే ఆ ఫైలు పంపాలని ఎస్ఐని ఆదేశించా. - **శ్రీనివాసరావు, రేణిగుంట డీఎస్పీ**

టెక్నాలజీ గురు చంద్రబాబు!

● విజ్ఞానాన్ని విధ్వంసానికి వాడొద్దు ● దేశ ప్రగతికి తోడ్పాటునివ్వండి ● విద్యార్థులకు భువనేశ్వరి దిశానిర్దేశం



కుప్పం/గుడుపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుగారు విజ్ఞానంతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షిస్తారు. అందుకోసమే పరిశ్రమిస్తారు. టెక్నాలజీ రెండువైపులా పదునున్న కత్తివంటిది. దాన్ని విధ్వంసానికి వాడొద్దు. టెక్నాలజీతో దేశ ప్రగతికి తోడ్పడండి.' అని భువనేశ్వరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అందరికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. అయితే ఆ టెక్నాలజీ వినియోగం గాడితప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికాసానికి, తద్వారా దేశ ప్రగతికి టెక్నాలజీని వినియోగించుకోవాలని, విధ్వంసానికి దాన్ని వాడొద్దని విద్యార్థులను హెచ్చరించారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులోకి వస్తున్న విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న చంద్రబాబు, తద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి, సామాజిక, ఆర్థిక పరిపుష్ఠికి వినియోగపడేలా ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని ఆయన కోరుకుంటారన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతవరకు వాడుకోవాలో, ఈమేరకు వాటినుంచి లబ్ధిపొంది, అనసరమైనదానికి దూరంగా ఉంచాలో ఎవరికివారు తెలుసుకోవాలన్నారు.

టెక్నాలజీ వాడకం దేవాన్ష్‌కు తెలుసు

టెక్నాలజీని ఎంతమేరకు వినియోగించుకోవాలో, ఎప్పుడు దూరంగా ఉంచాలో తన మనవడు దేవాన్ష్‌కు తెలుసని భువనేశ్వరి చెప్పారు. అధిక సమయం స్క్రీన్ చూడడంవల్ల చదువుపైన శ్రద్ధ తగ్గి, విద్యార్థుల దృష్టి ఇతరత్రా అనవసరమైన విషయాలపైకి మళ్లుతుందని చివరికి జీవితం గాడి తప్పుతుందని హెచ్చరించారు. 'దేవాన్ష్ ఫోన్లు, ఇతర గాడ్జెట్లు పరిమితంగా మాత్రమే వాడతాడు. అధిక సమయం స్క్రీన్ ముందు గడపడు. ఓ తల్లిగా చెబుతున్నా, టెక్నాలజీని వికాసానికి మాత్రమే వాడండి' అని భువనేశ్వరి విద్యార్థులకు హితవు పలికారు. గుడుపల్లె మండలంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1999లో 172 ఎకరాలు కేటాయించడం ద్వారా సాధిస్తున్న మంచి ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామన్నారు. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మాత్రం 53వ స్థానంలో ఉండడం విచారకమైన విషయమని చెప్పారు. అయితే 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంలో భారత్ 6వ స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. విజ్ఞాన రంగంలో పరిశోధనకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సైంటిఫిక్ టెంపర్ పెంచే విషయంలో విద్యార్థులకు తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని భువనేశ్వరి హామీ ఇచ్చారు.



అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులతో భువనేశ్వరి

● చంద్రబాబు కుటుంబ సభ్యులు మీరే

'ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజమైన కుటుంబ సభ్యులంటే మీరే. మీకోసమే ఆయన తెల్లవారుజాము లేచింది మొదలు, రాత్రి 12గంటల దాకా విరామం లేకుండా పనిచేస్తారు.' అని భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో భువనేశ్వరి మాట్లాడాక ఒక విద్యార్థిని పైకి లేచి చంద్రబాబు దినచర్య గురించి చెబితే తాము స్ఫూర్తి పొందుతామని అడిగారు. దానికి ఆమె సమాధానమిస్తూ ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలన్న తపనతో చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. 'చంద్రబాబుగారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఒక్కోసారి ఆయన రాత్రి ఒంటి గంటదాకా పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే లేచి యోగా, ధ్యానం చేస్తారు.' అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనే ఆయన ధ్యేయమన్నారు. తనకు మొదట్లో రాజకీయాల గురించి పట్టేది కాదన్నారు. హెరిటేజ్ వ్యవహారాలతోపాటు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వహణ నా బాధ్యతలు. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్నారని, వారిని చూస్తుంటే తనకు గర్వంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువులపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని విద్యార్థులకు భువనేశ్వరి ఉద్బోధించారు.

● అమ్మానాన్నలే స్ఫూర్తి

ఎవరికైనా అమ్మానాన్నలే స్ఫూర్తి కావాలని భువనేశ్వరి అన్నారు. తనవరకు తల్లిదండ్రులే స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. 'నాన్నగారు చిన్న వయసులోనే ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి, తర్వాత స్కూలుకు వెళ్లేవారు. కుటుంబంకోసం ఆయన పడిన కష్టం చూస్తూ పెరిగినదాన్ని. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవారు. మళ్లీ తెల్లారి లేచేటప్పటికి వెళ్లిపోయేవారు. అమ్మ మమ్మల్ని ఎంతో బాధ్యతగా పెంచింది. నాన్న కష్టం, అమ్మ బాధ్యత చూస్తూ పెరిగినవాళ్లం. మీరు కూడా బాధ్యతగా మెలగాలి.మీ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తేవాలి' అని భువనేశ్వరి విద్యార్థులకు ఉద్బోధించారు.అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, స్థానిక టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన సప్తగిరులు

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం మలయప్పస్వామి ఊంజల్‌సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో సప్తగిరులు పులకించాయి. అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహ భాషణం చేస్తూ అన్నమయ్యకు, వారి ఆచార్య పీఠమైన అహోబిలం మఠానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అహోబిలం నరసింహస్వామి అనుగ్రహంతో తాళ్లపాక అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారన్నారు. ఈ మంత్రోపదేశంలో 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ముందుగా దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంలో భాగంగా 'దినము ద్వాదశి నేడు', భావములోనా బాహ్యము, ఎంతమాత్రమునా ఎవ్వరు దలిచిన, పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, నారాయణతేనమో.., వంటి కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం దుంగల స్వాధీనం

మంగళం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాహనం సహా 10 ఎర్రచందనం దుంగలను జిల్లా అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌కు అందిన రహస్య సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు బుధవారం తెల్లవారుజామున పంగూరు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపుగా టీఎన్ 31ఏకే 7299 నంబరు గల వాహనం వేగంగా వెళుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో అధికారులు వెంబడించారు. స్మగ్లర్లు దర్గిపేరి గ్రామానికి కొంతదూరంలో హైవేపై వాహనాన్ని వదలిపారిపోయారు. అధికారులు వాహనంలో తనిఖీ చేయగా పది ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం సహా వాటి విలువ రూ.5లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో సికిందర్, ఎఫ్‌బీవోలు పురుషోత్తం, శోభారాణి, వాచర్లు పొన్నయ్య, జితేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్ర చందనంతో అటవీశాఖ అధికారులు